క్లుప్తంగా

మంచెం గోపాలకృష్ణయ్య సేవలు ప్రశంసనీయం

భీమడోలు: దివంగత మాజీ సర్పంచ్ మంచెం గోపాలకృష్ణయ్య గ్రామాభివృద్ధికి చేసిన సేవలు ప్రశంసనీయమని పలువురు వక్తలు కొనియాడారు. భీమడోలు మాజీ సర్పంచ్ మంచెం గోపాలకృష్ణయ్య విగ్రహావిష్కరణ ద్వితీయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం సాయంత్రం భీమడోలు పంచాయతీ కార్యాలయంలోని గోపాలకృష్ణయ్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ భీమడోలు సర్పంచ్‌గా 27 ఏళ్ల పాటు మంచెం గోపాలకృష్ణయ్య పని చేసి గ్రామాభివృద్ధికి కృషి చేశారన్నారు. అనంతరం గోపాలకృష్ణయ్య కుటుంబ సభ్యుల ఆర్థిక సాయంతో పంచాయతీ పారిశుద్ధ్య సిబ్బంది, పేదలకు దుప్పట్లను పంపిణీ చేసారు. పెద్దలు మంచెం రవీంద్ర, ఈతకోట సుబ్బారావు, మంచెం నాగు, వణుకూరి మురళీ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పెదవేగి : మద్యం తాగేందుకు డబ్బులు అడిగినా భార్య ఇవ్వలేదని మనస్తాపం చెందిన భర్త పురుగు మందు తాగి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటనపై ఆదివారం కేసు నమోదు చేసినట్లు పెదవేగి ఎస్సై కె రామకృష్ణ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం పెదవేగి మండలం లక్ష్మీపురం పంచాయతీ దిబ్బగూడెంకు చెందిన బడిపాటి రవికుమార్ మద్యానికి బానిసయ్యాడు. శనివారం భార్య వెంకటేశ్వరమ్మను మద్యం తాగేందుకు డబ్బులు అడిగాడు. ఆమె ఇవ్వకపోవడంతో మనస్థాపం చెందిన రవికుమార్ (46) పురుగు మందు తాగా డు. ఇది గమనించిన ఆమె తన భర్తను ఏలూరులోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం రవికుమార్ మృతిచెందాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

ఆర్థిక సాయం అందజేత

భీమడోలు: ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడంలో భీమడోలు మానస ఇంగ్లీషు మీడియం పాఠశాల చిన్నారుల చొరవ ఆదర్శనీయంగా నిలిచింది. ప్రిన్సిపల్ యలమర్తి రవీంద్ర కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులు దాచుకున్న రూ.50వేల నగదును రోడ్డు ప్రమాదంలో క్షతగాత్రురాలైన భీమడోలుకు చెందిన పతివాడ అనసూయకు చికిత్స నిమిత్తం అందించారు. అనసూయ తణుకు సమీపంలోని ఓ ఫ్యాక్టరీకి పని నిమిత్తం ఆటోలో వెళ్తుండగా రోడ్డు ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో ఆమె రెండు కాళ్లు పూర్తిగా దెబ్బతినడంతో మంచానికే పరిమితమైంది. ఆమెకు ఇద్దరు పిల్లలున్నారు. ఆమె కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న మానస ప్రిన్సిపల్, చిన్నారులు, ఉపాధ్యాయులు స్పందించి ఆర్థిక సాయం అందించారు. ఆ సొమ్మును భీమడోలులో ఎంపీ పుట్టా మహేష్ కుమార్, ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు చేతుల మీదుగా అనసూయకు శనివారం అందించారు. ఎంపీ స్పందించి తన వంతు సాయంగా రూ.25వేలు అందించారు.

ఎక్కడి చెత్త అక్కడే !



జిల్లా గ్రంథాలయ సంస్థ ఎదురుగా పేరుకుపోయిన చెత్త



జిల్లా పరిషత్ అతిథి గృహం గోడ వద్ద కుప్పలుగా పడి ఉన్న చెత్త

- రద్దీ ప్రాంతాల్లో కుప్పలుగా పేరుకుపోయిన చెత్త
- సుందరీకరణ పనుల పేరుతో గోడలకు రంగులు
- ఇదే క్రమంలో పారిశుద్ధ్యంపై నిర్లక్ష్య వైఖరి
- విస్తుపోతున్న నగర ప్రజలు

ఏలూరు (టూటౌన్): పండుగ వేళ నగరంలో ఎక్కడి చెత్త అక్కడే దర్శనమిస్తుంది. అదీ నిత్యం వేలాది మంది ప్రజలు రాకపోకలు సాగించే ఇండోర్ స్టేడియం రోడ్డుకు ఇరువైపులా ఈ చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. సంక్రాంతి పండుగ అంటేనే ప్రజలకు ఎంతో ప్రీతి పాత్రమైనది.ఈ పండుగ రోజుల్లో దేశ విదేశాల్లో ఉన్న ఆడపిల్లలు పుట్టింటికి రావడం పరిపాటి. అదేవిధంగా ఇతర ప్రాంతాల్లో ఉన్న కుటుంబ సభ్యులు సొంత ఇంటికి చేరుకుంటారు. దీంతో సంక్రాంతి మూడు రోజులు నగరంలోని ప్రతీ ఇంటిలోనూ ఒక విధమైన కోలాహలం,సందడి నెలకొంటుంది. దీన్ని దృష్టిలో ఉంచుకునే నగరపాలక సంస్థ ప్రధాన రోడ్డులో ఉన్న డివైడర్‌లను రంగు, రంగులతో తీర్చిదిద్దుతుంది. మరో ప్రక్క వీధిలైట్లను ఎల్ఈడీ బల్బులు అమర్చి కొత్త శోభను తీసుకు వచ్చారు. ఇదే క్రమంలో నగరంలో ప్రతి రోజు చేయాల్సిన పారిశుద్ధ్య పనులను నిర్లక్ష్యం చేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొత్త హంగులు ఎలా ఉన్నా ప్రతిరోజూ చేయాల్సిన క్లీన్ అండ్ గ్రీన్ పనులు చేయాలని నగరవాసులు కోరుతున్నారు.

జిల్లా కార్యాలయాల వద్దే చెత్త కుప్పలు

ఏలూరు ఇండోర్ స్టేడియం చుట్టూ ఉన్న రోడ్డులోనే పలు జిల్లా అధికారుల కార్యాలయాలు ఉన్నాయి. ఇటువంటి మార్గంలోనే ఇబ్బడి ముబ్బడిగా అపరిశుభ్రత తాండవిస్తోంది. నిత్యం ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు వచ్చి పోయే జిల్లా పరిషత్ అతిథి గృహాన్ని ఆనుకుని ఉన్న గోడ పక్కన ఎడా పెడా చెత్తను వేసేస్తున్నారు. దీన్ని ప్రతి రోజూ శుభ్రం చేయాల్సిన నగరపాలక సంస్థ సిబ్బంది శ్రద్ధ చూపడం లేదు. ఈ ప్రాంతం కలెక్టరేట్ వద్ద ధర్నా ప్రాంతం కావడం ప్రతి రోజూ ఏదో ఒక సమస్యపై ఆయా వర్గాల వారు ధర్నాలు, నిరసనలు చేపట్టడం పరిపాటే. అటువంటి ప్రాంతంలో చెత్తను తీయడంలో కూడా నిర్లక్ష్య వైఖరి చూపడంపై పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచి సెంటర్, గృహ నిర్మాణ శాఖ కార్యాలయం వద్ద, జిల్లా గ్రంథాలయ సంస్థ లైబ్రరీ వద్ద, కోర్టు వెనుక గోడ వద్ద ఇలా చెత్తకుప్పలు దర్శన మిస్తున్నాయి. జిల్లా యంత్రాంగం, ప్రజాప్రతినిధులు సంచరించే ప్రాంతాల్లోనే పారిశుద్ధ్య లోపం కనబడుతుండటంతో నగరపాలక సంస్థ వైఖరిని పలువురు తప్పుబడుతున్నారు.

ప్రచార ఆర్భాటానికే పరిమితం

సంక్రాంతి వేళ ఏలూరు నగరాన్ని అత్యంత సుందరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు నగరపాలక సంస్థ అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రకటనలు గుప్పిస్తున్నారు. దీన్ని ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు గొప్పగా ప్రచారం చేస్తున్నారు. ఇదే సమయంలో నగరంలో పారిశుద్ధ్యం మెరుగు పర్చే పనుల్లో నిర్లక్ష్యం వహిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రచారంపై ఉన్న ఆసక్తి సమస్యల పరిష్కారం పట్ల చూపడం లేదనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి.

పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు చేపట్టాలి



ఏలూరు నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని ప్రాంతాల్లోనూ పారిశుద్ధ్యం మెరుగుకు అధికారులు చర్యలు తీసుకోవాలి. మారుమూల ప్రాంతాల్లో పారిశుద్ధ్య చర్యలు చేపట్టడం లేదు. నగర పాలక సంస్థ అధికారుల పర్యవేక్షణ లోపించడం వల్లే నగరంలో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా తయారైంది. – ఎండీ.ఇస్మాయిల్ షరీఫ్, సామాజిక కార్యకర్త, ఏలూరు

చెత్త కుప్పలను తక్షణం తొలగించాలి



కార్పొరేషన్ పరిధిలో పేరుకుపోయిన చెత్త కుప్పలను తక్షణం తొలగించాలి. నిత్యం జన సంచారం ఉన్న ప్రాంతాల్లోనే చెత్తకుప్పలు పేరుకుపోవడం దారుణం. నగరంలోని పలు ప్రాంతాల్లో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉంది. పారిశుద్ధ్యం మెరుగుకు అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు చేపట్టాలి. – బి.నాగరాజు, ఏలూరు

అమిత్‌షాను పదవి నుంచి వెంటనే తొలగించాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ప్రపంచ మేధావి బీఆర్ అంబేడ్కర్‌ను పార్లమెంట్ సాక్షిగా అవమానించిన కేంద్ర మంత్రి అమిత్ షాను వెంటనే మంత్రి పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ ఏలూరులోని పాత బస్టాండ్ వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం నిరసన ప్రదర్శన చేశారు. అంబేడ్కర్‌ను అవమానించిన అంశాలను ప్రయాణికులకు వివరిస్తూ కరపత్రాలను పాత బస్టాండ్ ప్రాంగణంలో ఏలూరు జిల్లా కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి రాజనాల రామ్మోహన్‌రావు ఆధ్వర్యంలో పంచారు. ఈ సందర్భంగా రాజనాల మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు కలిగిన భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌ను పార్లమెంట్లో అవమానించడం అంటే భారత ప్రజలను అవమానించడమేనన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో ఏలూరు జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి దండుబోయిన చంద్రశేఖర్, జిల్లా కాంగ్రెస్ నాయకులు గౌడ రంగబాబు, బ్లాక్ టు కాంగ్రెస్ అధ్యక్షుడు లంక రామ్మోహన్, సిటీ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ తాళ్లూరు చక్రవర్తి, వేల్పుల వెంకటేశ్వరావు పాల్గొన్నారు.

పీఎం ఉపాధి కల్పన పథకంలో పరిశ్రమలకు రుణాలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): పీఎం ఉపాధి కల్పన పథకంలో ఆధునిక యంత్ర పరికరాల తయారీ పరిశ్రమల ఏర్పాటుకు రాయితీతో కూడిన రుణాలు మంజూరవుతాయని, యువత సద్వినియోగం చేసుకోవాలని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ కోరారు. ఏలూరు ఇండస్ట్రియల్ ఏరియా లో పీఎంఈజీపీ పథకం ద్వారా నూతనంగా ప్రారంభించిన అభి ఇంటీరియల్స్ మాడ్యులర్ కిచెన్ కప్‌బోర్డ్ పరిశ్రమను ఎమ్మెల్యే బడేటి చంటితో కలిసి ఎంపీ ఆదివారం ప్రారంభించారు. విశ్వబ్రాహ్మణ ఉద్యోగ వ్యాపారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు అప్పలభక్తుల శివకేశవరావు (శివ శ్రీ), విశ్వబ్రాహ్మణ సంఘ, కార్పెంటర్స్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

స్వచ్ఛ ఏలూరు అందరి లక్ష్యం కావాలి

జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి



నగర సుందరీకరణలో భాగంగా డివైడర్లకు పెయింటింగ్ వేస్తున్న కలెక్టర్, ఎస్పీ, జేసీ

ఏలూరు (టూటౌన్): ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపుమేరకు స్వచ్ఛభారత్ భారత్‌లో భాగంగా మన ఏలూరు– మన పరిశుభ్రత అనే కార్యక్రమాన్ని పురస్కరించుకొని ఏలూరు పట్టణసుందరీకరణలో భాగంగా ఆదివారం జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి, ఎమ్మెల్యే బడేటి రాధకృష్ణయ్య (చంటి), ఎస్పీ కె ప్రతాప్ శివ కిషోర్, జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, కోప్షన్ సభ్యులు ఎస్‌యంఆర్ పెదబాబుతో పాటు పలువురు వలంటీర్లు సుమారు 50 మంది పోలీస్ సిబ్బంది కలిసి ఏలూరు ఫైర్ స్టేషన్ సెంటర్ నుంచి జిల్లా ప్రజాపరిషత్ ఆఫీసు వద్ద వరకు ఉన్న డివైడర్లను సుందరీకరణలో భాగంగా పెయింటింగ్ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మన ఏలూరు– మన పరిశుభ్రత కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. కలెక్టర్ కె. వెట్రీసెల్వి మాట్లాడుతూ మన నగరం– మన ఆస్తి అనే సామాజిక స్పృహతో అందరూ సహకారం అందించాలన్నారు. స్వచ్ఛ ఏలూరుగా హేలాపురి నగరాన్ని తీర్చిదిద్దే కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు. ఎస్పీ కె. పి.ఎస్.కిషోర్ మాట్లాడుతూ నగర సుందరీకరణ కార్యక్రమంలో పాలు పంచుకోవడం ఆనందదాయకంగా ఉందన్నారు. జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి మాట్లాడుతూ నగర సుందరీకరణకు ఆటంకం కల్గించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటారని స్పష్టం చేశారు. డీఎస్పీ డి శ్రావణ్ కుమార్, ఏలూరు 3 టౌన్ ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావు, ఏలూరు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణరావు, డీఈఈ ఎస్.రామారావు, ఏలూరు నగర పాలక సంస్థ మేనేజర్ సీహెచ్‌వీ మూర్తి, డీఈఈ వి.తాతబ్బాయి, సాంబశివరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రైతుల సమస్యల పరిష్కారం కోసం 17న ధర్నా



ధర్నా కరపత్రాలను విడుదల చేస్తున్న ఏపీ రైతు సంఘం నాయకులు

ఏలూరు (టూటౌన్): రైతాంగ సమస్యలు పరిష్కారం కోసం ఈనెల 17న విజయవాడలో నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక అన్నే భవనంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా నాయకులు ధర్నా కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కట్టా భాస్కరరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కె.శ్రీనివాస్ మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పెట్టుబడి సాయం రూ.20 వేలు ఇస్తామని కూటమి ప్రభుత్వం వాగ్దానం చేసిందన్నారు. ఖరీఫ్ సీజన్ ముగిసి, రబీ సీజన్ సగం కాలం గడిచినా పెట్టుబడి సాయం ఇవ్వలేదన్నారు.ఉచిత పంటల బీమా రద్దు చేసి ప్రీమియం రైతులే చెల్లించాలని జీవో ఇవ్వడం అన్యాయమన్నారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు, పంట రుణాలు అందలేదన్నారు. వ్యవసాయ నష్టాలతో రైతుల ఆత్మహత్యలు రోజు రోజుకి పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ఢిల్లీ రైతాంగ ఉద్యమ సందర్భంగా ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయలేదన్నారు. మద్దతు ధరలు గ్యారెంటీ చట్టం తీసుకురాలేదన్నారు. రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం చేయాలని డిమాండ్ చేశారు.అన్నదాత సుఖీభవ పథకం పెట్టుబడి సాయం రూ.20వేలు వెంటనే ఇవ్వాలన్నారు.ఉచిత పంటల బీమా కొనసాగించి, ప్రీమియం ప్రభుత్వమే చెల్లించాలని కోరారు.

సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణకు నిధులు విడుదల చేయాలి

కొత్తగా వ్యవసాయ బోర్లు వేసుకున్న రైతులకు విద్యుత్ కనెక్షన్లు ఇవ్వాలన్నారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం పనులు పూర్తి చేయాలని, సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణకు నిధులు విడుదల చేయాలని కోరారు.చింతలపూడి ఎత్తిపోతల పథకం, గ్రీన్ ఫీల్డ్ హైవే, జీలుగుమిల్లి నుంచి పోలవరం వరకు జాతీయ రహదారి భూ నిర్వాసిత రైతులకు న్యాయమైన పరిహారం అందించాలని, గ్రీన్ ఫీల్డ్ హైవేకు సర్వీస్ రోడ్లు ప్రొవిజన్ కల్పించాలని, బలవంతపు భూసేకరణ ఆపాలన్నారు. పాడి రైతులకు పొరుగు రాష్ట్రాల్లో మాదిరిగా లీటరు పాలకు రూ.5 బోనస్ ఇవ్వాలన్నారు. పెదవేగి ఆయిల్ ఫెడ్ కర్మాగారాన్ని ప్రైవేటీకరించే చర్యలు ఆపాలని,ఈ కర్మాగారం అభివృద్ధికి నిధులు కేటాయించి ఆధునికరించాలని డిమాండ్ చేశారు. ఈనెల 17 నిర్వహించనున్న విజయవాడ ధర్నా విజయవంతం కోరుతూ జిల్లా వ్యాప్తంగా ప్రచారం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా సీనియర్ నాయకులు గుత్తికొండ వెంకట కృష్ణారావు, పలువురు రైతులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	20	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	38	చిక్కుడు కాయలు	68
వంకాయలు (కాంతులు)	52	బీన్సచిక్కుడు	88
వంకాయలు (తెలుపు)	36-48	చామదుంపలు	44
బెండకాయలు	44	ములక్కాడలు	10, 15
పచ్చిమిర్చి	36	కంద	76
కాకర కాయలు	44	బీట్‌రూట్	46
బీరకాయలు	40	కీరా దోస	40
బీరకాయలు (పందిరి)	48	ఫ్రెంచ్‌బీన్స్	80
క్యాబేజీ	24	అల్లం	60
క్యారెట్	48	కొత్తిమీర (కట్ట)	15
దొండకాయలు	54	పాలకూర	10
బంగాళదుంపలు	30-36	చుక్కకూర	10
ఉల్లిపాయలు	40	తోటకూర	10
గోరుచిక్కుడు	32	గోంగూర	07
దోసకాయలు	30-36	పుదీనా	05
ఆనపకాయ (1)	25-30	క్యాప్సికమ్	70
పొట్లకాయ(1)	20-25	చిలకడదుంప	44

యల్లా ప్రగడకు భారతరత్న ఇవ్వాలి

గణపవరం: మన జిల్లాకు చెందిన యల్లాప్రగడ చేసిన సేవలకు గుర్తుగా ఆయనకు భారతరత్న ఇవ్వాలని గణపవరం ఏరియా పీఎంపీ అసోసియేషన్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానించింది. ఆదివారం ప్రముఖ శాస్త్రవేత్త యల్లాప్రగడ సుబ్బారావు జయంతి సందర్భంగా గణపవరం లయన్స్ క్లబ్ భవనంలో నిర్వహించిన యల్లాప్రగడ జయంతి సభకుకు పీఎంపీ అధ్యక్షుడు ఎం.సత్యనారాయణమూర్తి అధ్యక్షత వహించారు. తొలుత యల్లాప్రగడ చిత్రపటానికి పూలమాలలు వేసి, జ్యోతి వెలిగించి నివాళులర్పించారు. ఈసభలో పీఎంపీ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు నిడమర్తి జయసూర్య మాట్లాడుతూ మానవాళి శ్రేయస్సు కోసం జీవితాంతం శ్రమపడి ఎన్నో ప్రాణాంతక వ్యాధులకు మందులు కనుగొని ప్రాణదాతగా నిలిచిన యల్లాప్రగడకు భారతరత్న ఇవ్వడం దేశానికే గర్వకారణమని అన్నారు. జిల్లా పీఎంపీ అధ్యక్షుడు ఏఆర్‌కే పరమేశ్వర్లు, మండల కమిటీ సభ్యులు యల్లాప్రగడ సేవలను కొనియాడారు.

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన



కూచిపూడి నృత్యాలు ప్రదర్శిస్తున్న కళాకారిణిలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక రామచంద్రరావుపేట వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న శ్రీవారి త్రిసప్తాహ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం నిర్వహించిన ఆధ్యాత్మిక, కూచిపూడి నృత్య కార్యక్రమాలు భక్తులను విశేషంగా అలరించాయి. ఉదయం స్వామి వారికి సుప్రభాత సేవ, నిత్యార్చన నిర్వహించారు. అనంతరం విష్ణు సహస్రనామ పారాయణ నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి విశేష అలంకరణ చేశారు. ఉదయం 10 గంటల నుంచి స్వామి వారి నిత్య కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. అనంతరం నీరాజన మంత్ర పుష్పాలు సమర్పించి తీర్థప్రసాద వితరణ చేశారు. సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సాయంత్రం 5 గంటలకు నండూరి శ్రీనివాస్ ఘంటసాల భక్తి సంకీర్తనలు పేరిట వివిధ చలన చిత్రాల్లో ఘంటసాల వెంకటేశ్వరరావు పాడిన భక్తి గీతాలను శ్రావ్యంగా ఆలపించారు. సాయంత్రం 6 గంటలకు విజయవాడకు చెందిన మాధురి ఆర్కెస్ట్రా ఆధ్వర్యంలో పీవీఏ ప్రసాద్ భక్తి సంగీత విభావరి నిర్వహించారు. రాత్రి 7గంటల నుంచి నగరానికి చెందిన నీరజ కూచిపూడి నాట్య అకాడమీ ఆధ్వర్యంలో నాట్యాచారిణి నాగమని బుద్ధదేవ్ శిష్య బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు విశేషంగా అలరించాయి. ఆలయ అర్చకులు కిశాంబి మారుతీ శ్రీనివాస రామానుజాచార్యులు విశేష పూజలు నిర్వహించగా ఆలయ కార్యనిర్వహణాధికారి నల్లూరి సతీష్‌కుమార్ పర్యవేక్షించారు.

సాల్వేషన్ ఆర్మీ చర్చిలో కోత పండుగ

దెందులూరు: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనతో పాటు దానగుణాన్ని కలిగి ఉండాలని సాల్వేషన్ ఆర్మీ డివిజనల్ కమాండర్ జల్లి మోషే అన్నారు. ఆదివారం దెందులూరు సాల్వేషన్ ఆర్మీ చర్చిలో కోత పండగ స్థానిక కోర్ ఆఫీసర్ మేజర్ ఎం. రమణయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. తొలుత ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. డివిజనల్ కమాండర్ జెల్లీ మోషే డీడీ డబ్ల్యూ ఎం.మేరి కుమారి లెఫ్టినెంట్ మాణిక్యం, కోర్ ఆఫీసర్ సువర్ణభాయ్ పది మందికి నూతన వస్త్రాలు, దుప్పట్లు పంపిణీ చేశారు. సంఘ పెద్దలు, గృహ సమితి సభ్యులు, సంఘస్తులు, చిన్నారులు పాల్గొన్నారు.

ఉత్సవ పోస్టర్ల ఆవిష్కరణ

పెదవేగి : భక్తుల కోరికలు తీర్చే కొంగుబంగారమైన గాలాయగూడెం అచ్చమ్మపేరంటాల తల్లి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు సిద్ధమయ్యాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అచ్చమ్మపేరంటాలు ఉత్సవ పోస్టర్లను ఆదివారం ఆయన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. తిరునాళ్లకు వచ్చిన భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కమిటీ సభ్యులకు ఎమ్మెల్యే సూచించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



గుండుగొలనులోని 1993-94 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు, ఉపాధ్యాయులు

భీమడోలు: గుండుగొలను మావులేటి సోమరాజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1993-94 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. 31 ఏళ్ల క్రితం ఇదే పాఠశాలలో చదువుకున్న 60మంది పూర్వ విద్యార్థులంతా ఒకే చోటకు చేరి సందడి చేసారు. గత మధుర స్మృతులను నెమరు వేసుకుంటూ ఉత్సాహంగా గడిపారు. ఈసందర్భంగా గురువులకు పాదాభివందనం చేసి వారిని దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేసారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఉపాధ్యాయులు మధుసూధనరావు, సోమేశ్వరరావు, ఛాత్రా ది శేషగిరిరావు, సుభాషిణి, పూర్వ విద్యార్థులు నోమి సీతారాం, పాదిలాపు వెంకట్రావు, రాగం నాగేశ్వరరావు, అడగా గణేష్ పాల్గొన్నారు.

అలనాటి మధుర స్మృతులతో..

పెదపాడు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆనందోత్సాహాల మధ్య సందడిగా జరిగింది. వివిధ ప్రదేశాల్లో ఉద్యోగ వ్యాపారాల్లో స్థిరపడిన మిత్రులంతా తిరిగి బాల్యంలో విద్యాబుద్ధులు నేర్చుకున్న పాఠశాలలో కలుసుకుని అలనాటి స్నేహానుభూతులను పంచుకున్నారు. 33 ఏళ్ల తరువాత పాఠశాలకు చెందిన 1990-91 టెన్త్ బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు ఆదివారం కలుసుకుని మధురస్మృతులను నెమరవేసుకుని సందడి చేశారు. అందరనీ ఒక వేదికపైకి తీసుకురావడంలో కృషి చేసిన స్నేహితులను వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు మోటూరి సీతారాంబ్రహ్మం, మోటూరి లక్ష్మి, కుకునూరి సీతారామకృష్ణారావు, పేర్ల సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

పోతునూరులో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

దెందులూరు: పోతునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1996-97లో 10వ తరగతి చదువుకున్న విద్యార్థులందరూ ఆదివారం కలిసి ఆత్మీయ సమ్మేళనంలో సందడి చేశారు. పూర్వ హెచ్ఎం గురుమూర్తి, గణిత ఉపాధ్యాయుడు ఎం.సీతారామయ్య, రిటైర్డ్ క్రాఫ్ట్ టీచర్ వేణు అమరేశ్వరరావు, ప్రస్తుత ఇన్‌ఛార్జి హెచ్ఎం వల్లి, పూర్వ విద్యార్థులు సున్నా సుధీర్, జీ.జయరామ్, కే.శ్రీనివాసరావు, ఎస్. బుజ్జిబాబు, డీ.ప్రసాద్, కే.రత్నకుమారి, అగుల్ల నాగేశ్వరరావు, జీ.రామ్‌కుమార్ పాల్గొన్నారు.

గుర్తుకొస్తున్నాయి..

దెందులూరు : చిన్ననాటి స్నేహితుల ఆప్యాయ పలకరింపులు, కల్మషం లేకుండా నిక్‌నేమ్‌లతో పిలుపుతోపాటు బాల్య స్మృతులన్నీ నెమరు వేసుకుని ఆహ్లాదంగా పూర్వ విద్యార్థులందరూ ఆనందంగా గడిపేందుకు దెందులూరు మండలం జోగన్నపాలెంలోని విద్యానిలయం హైస్కూల్ వేదికైంది. పాఠశాలలో 1975-76 పదవ తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం 50 ఏళ్ల తరువాత చిన్ననాటి స్నేహితులను కలుసుకుని సందడి చేశారు.

నారాయణపురంలో రక్తదాన శిబిరం

ఉంగుటూరు: నారాయణపురం గీతాంజలి స్కూలు వద్ద రక్తదాన శిబిరం ఆదివారం నిర్వహించారు. యువజన దినోత్సవం సందర్భంగా అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో ఈ రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు.